

శాంతి భద్రతలపై అసెంబ్లీలో రభస

రాష్ట్రంలో కొన్ని రోజులుగా జరుగుతున్న హత్య లు, నేరాలపై అసెంబ్లీలో వాడి వేడిగా చర్చ జరిగింది. అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్ష నేత విమర్శలు చేయగా, ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా దీటుగా సమాధానం ఇచ్చారు. అంతే కాకుండా రాష్ట్రంలో శాంతి భద్రతలు భేషుగ్గా ఉన్నాయంటూ కితాబిచ్చారు. ఈ మేరకు గురువారం జీరో అవర్‌లో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఈపీఎస్ చేసిన ప్రసంగాన్ని స్పీకర్ రికార్డుల నుంచి తొలగించడంతో అన్నాడీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇలా వాద ప్రతివాదనలతో అసెంబ్లీ హోరెత్తింది.

ఒకే రోజు నాలుగు హత్యలా?

- ప్రభుత్వాన్ని నిలదీసిన ఈపీఎస్
- స్పీకర్ వైఖరికి నిరసనగా వాకౌట్

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఒకే రోజు నాలుగు హత్యలు జరిగాయని, ఇంత జరుగుతున్నా వీటిని నిరోధించేందుకు డీఎంకే ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. శాసనసభలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ హోం శాఖ నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ అన్ని చోట్లా నేరాలు జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, దీనిపై నిలదీస్తే గతం కంటే నేరాలు తగ్గాయంటూన్ పాత సంగతులతో పోల్చి మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో నేరాల సంఖ్య బంగారం ధరల్లా విపరీతంగా పెరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్న నేరాలపై మాట్లాడేందుకు స్పీకర్ అనుమతించలేదని, తప్పుడు లెక్కలు చెప్పి తప్పించుకునే యత్నం చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. అదే సమయంలో శాంతి భద్రతలను పరిక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ ఈపీఎస్ చేసిన ఆరోపణలను స్పీకర్ అప్పావు సభ రికార్డులనుండి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆగ్రహించిన అన్నాడీఎంకే శాసనసభ్యులు సభ నుండి వాకౌట్ చేశారు. ఈపీఎస్ ఆరోపణలను ఖండిస్తూ సమాధానం చెప్పేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ లేచి అన్నాడీఎంకే సభ్యులంతా సభలోనే ఉండి తాను చెప్పేది విని వాకౌట్ చేయాలని పదేపదే విజ్ఞప్తి చేశారు. స్టాలిన్ మాటలను పట్టించుకోకుండా అన్నాడీఎంకే సభ్యులందరూ వాకౌట్ చేశారు. పిరికిపందల్లా సభ నుండి వెళ్ళిపోతున్నారంటూ అన్నాడీఎంకే సభ్యులవైపు చూస్తూ స్టాలిన్ యెద్దేవా చేశారు.



అసెంబ్లీ వెలుపల మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

బంగారం ధరల్లా హత్యలూ పెరుగుతున్నాయి..

శాసనసభ నుండి వాకౌట్ చేసిన తర్వాత ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ నేరాలు జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడమే ప్రభుత్వ బాధ్యత అని, ఈ విషయాన్ని వదలిపెట్టి ముఖ్యమంత్రి స్టాలిన్ దీనికి తోడు కీలకమైన శాంతి భద్రతలపై ప్రధాన ప్రతిపక్షనేతగా తాను చేసిన విమర్శలను, సభ రికార్డులను తొలగిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారన్నారు. స్పీకర్ వైఖరిని ఖండిస్తూ తామంతా సభ నుండి వాకౌట్ చేసినట్లు తెలిపారు. అన్నాడీఎంకే సభ్యులంతా భయంతో సభ నుండి వాకౌట్ చేసినట్లు ముఖ్యమంత్రి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. బుధవారం ఒకే రోజునాలుగు హత్యలు, అదీ పట్టపగలు జరుగటం గురించి తాము ప్రశ్నిస్తే వెంటనే గత ప్రభుత్వ హయంలో నేరాల సంఖ్య అధికమంటూ సభను పక్కదోవపట్టిస్తున్నారని, రోజూ జరిగే నేరాలను నిరోధించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారో సభలో వివరించకుండా పాత సంగతులను సభలో ప్రసంగించడం భావ్యం కాదని హితవు పలికారు. నేరస్థులను త్వరగా అరెస్టు చేశామని చెప్పుకోవటం గొప్పకాదని, ఆ నేరాలను ఎలా నిరోధించగలిగాలో చెబితే అందరూ సంతోషిస్తారన్నారు. రాష్ట్రంలో పోలీసు శాఖ అంటూ ఉందా? అనే అనుమానం ప్రజలలో కలుగుతోందన్నారు. మదురై పెరుంగుడి వద్ద వాచ్‌మన్, కోవైలో ఉపాధ్యాయురాలిని నిప్పంటించి హతమార్చటం, ఈరోడ్ లో రౌడీ జాన్‌ని హతమార్చటం, తిరునల్వేలిలో మాజీ ఎస్‌ఐ హత్య, ఇక రాజధాని నగరం చెన్నైలో డీఎంకే నేత కిడ్నాప్, హత్య ఇలా వరుసగా నేరాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి స్టాలిన్ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఈపీఎస్ ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, హత్యలు నేరాలుఘోరాలు గురించి తాము సభలో సమగ్రంగా వివరిస్తే డీఎంకే ప్రభుత్వం కుప్పకూలిపడటం తథ్యమన్నారు. టాస్మాక్‌లో భారీ స్థాయిలో అవినీతి జరిగితే ఈడీ తనిఖీలను సవాలు చేస్తూ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించడం భావ్యం కాదన్నారు.

శాంతి భద్రతలు భేషుగ్గానే ఉన్నాయ్!

- అసెంబ్లీలో ఈపీఎస్‌కు సీఎం కౌంటర్

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలు భేషుగ్గానే ఉన్నాయని, గత 12 యేళ్లతో పోల్చుకుంటే గత యేడాది తక్కువ సంఖ్యలోనే హత్యలు జరిగాయని హోంమంత్రిత్వ శాఖ కూడా నిర్వహించే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. శాసనసభలో గురువారం ఉదయం ప్రధాన ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) జీరో అవర్‌లో శాంతిభద్రతలు పరిరక్షించడంలో డీఎంకే ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపణలు చేసిన సభ నుండి వాకౌట్ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. శాసనసభలో ఈపీఎస్ ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా శాంతి భద్రతలపై జీరో అవర్‌లో ప్రసంగించేందుకు స్పీకర్ అనుమతించారని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా ప్రభుత్వంపై అవాస్తవమైన ఆరోపణలతో విమర్శలు చేసి తాను వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా సభ నుండి నిష్క్రమించడం గర్హనీయమన్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో జరిగిన అవాంఛనీయ సంఘటనలను ప్రస్తావించనున్నాననే భయంతో సభ నుండి వాకౌట్ చేశారన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నాలుగు హత్యలు గురించి ఈపీఎస్ సభలో ప్రస్తావించారని, ఆ నాలుగు కేసుల్లో మూడు కేసుల తీరుతెన్నులు వేరేగా ఉన్నాయని, అవి హత్యలు కావని ఆత్మహత్యలని, పాతకక్షల నేపథ్యంలో, కుటుంబ తగాదాల కారణంగా జరిగినవనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇక ఈరోడ్‌లో సేలంకు చెందిన రౌడీ హత్య కేసులో పోలీసులు స్పందించిన తీరు ప్రశంసనీయమని, నడిరోడ్డులో రౌడీ జాన్ అలియాస్ చాణక్యన్‌ని, ఆయన భార్యపై దుండగులు మారణాయుధాలతో దాడి జరిపి పారిపోయారని, జాన్ హత్య జరిగిన గంటలోపే పోలీసులు మచ్చపల్లి వద్ద కారులో పారిపోతున్న వారిని ఏ విధంగా పట్టుకున్నారో ప్రజలకు తెలుసని, ఆ కారులో ప్రయాణించిన కార్తీక్ అనే నిందితుడిని కూడా నిర్బంధించారని ముఖ్యమంత్రి తెలిపారు. పోలీసులు స్వేచ్ఛగా తమ విధులు నిర్వర్తిస్తున్నారనడానికి ఈ సంఘటన చక్కటి ఉదాహరణ అని కొనియాడారు. హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడేవారు ఎంతటి తీవ్ర నేరస్థులయినా, తమ పార్టీకి చెందినవారైనా ఏ మాత్రం వెనుకాడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు తాను ఆదేశాలిచ్చానని చెప్పారు. కనుకనే గత నాలుగేళ్లగా హత్యలు, దోపిడీలు తదితర నేరాల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చాయన్నారు. గత యేడాది 4572 మంది సంఘ విద్రోహులను గూండా చట్టం కింద అరెస్టు చేశామన్నారు. గత 12 యేళ్ల గణాంకాలను పరిశీలిస్తే గత యేడాది తక్కువగా అంటే 1540 హత్యా సంఘటనలు మాత్రమే జరిగాయన్నారు. ఇక రాష్ట్రంలో స్వల్ప కారణాల వల్ల, కుటుంబ తగాదాల కారణంగా జరిగే హత్యలను సామాజిక ప్రసార మాధ్యమాల్లో పదేపదే చూపుతూ రాష్ట్రంలో హత్యలు పెరిగాయని ప్రజలకు తప్పుడు అవగాహన కల్పిస్తున్నారని స్టాలిన్ చెప్పారు.



శాంతిభద్రతలపై ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



వరుస ఘటనలతో పోలీసుల అలర్ట్



నేరగాళ్ళ కోసం వేట ● అవసరమైతే కాల్పులు
● డీజీపీ శంకర్ జివాల్ ఆదేశం

అడయార్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా వరుస హత్యాఘటనలు జరుగుతున్నాయి. దీంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ కేసులతో సంబంధం ఉండే నేరస్తులను పట్టుకోవాలని, ఇందుకోసం అవసరమైతే ప్రాణహాని లేకుండా కాల్పులు జరిపి వారిని పట్టుకోవాలని రాష్ట్ర పోలీస్ బాస్ శంకర్ జివాల్ ఆదేశాలు జారీచేశారు. తిరునెల్వేలి జిల్లాలో రిటైర్డ్ ఎస్‌ఐ జాకీర్ హుస్సేన్ ఒక భూవివాదం కేసులో దారుణ హత్యకు గురయ్యారు. ఈ అంశం రాష్ట్ర శాసనసభలో సైతం ప్రస్తావనకు వచ్చింది. ఈ హత్యను ప్రస్తావించిన విపక్ష సభ్యులు రాష్ట్రంలో శాంతిభద్రతలు అడుగంటి పోయాయని, పోలీసులకే రక్షణ లేకుండా పోయిందంటూ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. తప్పు చేసే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తుందంటూ ఆరోపించారు. విపక్ష సభ్యుల విమర్శలను సీఎం స్టాలిన్ తిప్పికొట్టారు. నెల్లై ఘటన తర్వాత డీఎంకే కార్మిక సంఘ నేత, మాజీ ఎంపీ కుప్పుస్వామి బంధువు కుమార్ అనే వ్యక్తి కూడా భూవివాదం కేసులోనే హత్యకు గురయ్యారు. ఈ వరుస సంఘటనల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నేరాలను అదుపుచేసేందుకు డీజీపీ శంకర్ జివాల్ కఠినమైన ఆదేశాలు జారీచేశారు. ఎస్పీలు, కమిషనర్లు, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు తమతమ పరిధిలోని నేరాల అదుపునకు కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. క్రిమినల్స్‌ను అరెస్టు చేసే విషయంలో అవసరమైతే ప్రాణహాని జరగకుండా కాల్పులు జరిపి వారిని అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, భూవివాదాలపై వచ్చే ఫిర్యాదులపై తక్షణం విచారణ జరిపి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఆయా పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు కూడా ఆదేశించారు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా అజ్ఞాతంలో ఉన్న నేరస్థుల వివరాలను సేకరించి, వారిని తక్షణం అరెస్టు చేసేలా అసిస్టెంట్ కమిషనర్లు, డీఎస్పీలు, సీఐలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, నేరస్థులకు ఆశ్రయం కల్పించే వారిపై కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీకార హత్యలకు పాల్పడే రౌడీలను జైళ్ళ నుంచి విడుదలకాకుండా అలాంటి వారిపై గూండా చట్టం ప్రయోగించి జైళ్ళలోనే ఉండేలా చూడాని కోరారు. రౌడీల మధ్య జరిగే ఘర్షణలు, హత్యల నేపథ్యంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, ఈ కేసుల్లో సంబంధం ఉన్నవారిని తక్షణం అరెస్టు చేయాలని ఆదేశించారు. ఒకవేళ కోర్టు ఆదేశాల మేరకు రౌడీలు జైళ్ళ నుంచి విడుదలైతే వారిపై పోలీసులు ఓ కన్నేసి ఉంచాలని డీజీపీ ఆదేశించారు.

టాస్మాక్‌లో తనిఖీల వ్యవహారం

ఈడీ దూకుడుకు హైకోర్టు కళ్లెం



- తదుపరి చర్యలకు బ్రేక్

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో ఇటీవల చేసిన తనిఖీలకు సంబంధించి తదుపరి విచారణ, చర్యలు చేపట్టకూడదంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి హైకోర్టు ఉత్తర్వు జారీ చేసింది. దాడులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు సమాధానాలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో ఈ నెల 22న దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసు తదుపరి విచారణ ఈ నెల 25కు వాయిదా వేసింది. ఇటీవల ఎగ్మూరులోని టాస్మాక్ ప్రధాన కార్యాలయం సహా 20 చోట్ల ఈడీ మూడు రోజులపాటు తనిఖీలు చేసి రూ.1000 కోట్లకు పైగా అవినీతి జరిగిందని ఆరోపిస్తూ ఓ ప్రకటన కూడా వెలువరించింది. టాస్మాక్‌లో మద్యం ధర కంటే రూ.10ల నుండి రూ.30ల అధికంగా నిర్ణయించి విక్రయించారని, టాస్మాక్ ఉన్నతాధికారులకు మద్యం కర్మాగారాల యజమానులకు సంబంధాలున్నాయని, కొనుగోళ్లు, విక్రయాలకు సంబంధించి తప్పుడు లెక్కలు చూపడం, బార్ లైసెన్స్‌లకు లంచం వంటి అవినీతి అక్రమాలు పెద్ద యెత్తున జరిగాయని, వీటికి సంబంధించి కీలకమైన పత్రాలను సైతం స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ నేపథ్యంలో తమ సంస్థలో ఈడీ తనిఖీలు జరిపేందుకు ఎలాంటి అధికారాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండానే తనిఖీలు జరిగాయని, ఈ పరిస్థితుల్లో ఈడీ తదుపరి చర్యలు తీసుకోకుండా స్టే విధించాలని కోరుతూ టాస్మాక్ సంస్థ హైకోర్టులో పిటిషన్ వేసింది. విచారణ పేరుతో టాస్మాక్ అధికారులను, సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా అడ్డుకోవాలని కూడా కోరింది. అంతే కాకుండా ఈ నెల 6 నుండి 8 వరకు టాస్మాక్ ప్రధాన కార్యాలయం తదితరప్రాంతాల్లో జరిపిన తనిఖీలు చట్ట వ్యతిరేకమైనవిగా ప్రకటించాలని కూడా ఆ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, ఎన్.సెంథిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ఎదుట గురువారం ఉదయం విచారణకు వచ్చింది. టాస్మాక్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి తన వాదనలు వినిపిస్తూ టాస్మాక్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుపుతున్న సంస్థ అని, ఆ సంస్థలో అక్రమ నగదు బట్వాడాల నిరోధక చట్టం ప్రకారం తనిఖీలు చేయడానికి ఈడీ డైరెక్టర్, లేదా డిప్యూటీ డైరెక్టర్ ర్యాంకు కలిగిన ఉన్నతాధికారులు అనుమతించిన అధికారులకే మాత్రమే అధికారం ఉంటుందని, అంతకంటే మించి సంస్థలో అక్రమ నగదు బట్వాడాలు జరిగాయని చెప్పటానికి ప్రాథమిక ఆధారాలు కూడా ఉండాలని, ఆ సంస్థలో అవినీతి సొమ్ము, లేదా అక్రమార్జనకు సంబంధించిన సొత్తుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలుండాలని, ఈవేవీ లేకుండానే ఈడీ అధికారులు తనిఖీలు జరపటం చట్ట విరుద్ధమని ఆరోపించారు. ఇక తనిఖీల సందర్భంగా మహిళా ఉద్యోగులను సైతం మూడు రోజులపాటు రాత్రి వరకూ నిర్బంధంలో ఉంచారని, వీరిని వేకువజాము ఒంటి గంటకు విడిచిపెట్టి ఉదయం ఎనిమిది గంటలకల్లా కార్యాలయానికి తిరిగి రావాలని బెదిరించారని ఆరోపించారు. తక్కిన అధికారులను ఇళ్ళకు వెళ్లటానికి కూడా ఈడీ అధికారులు అనుమతించలేదని, సుమారు 60 గంటలపాటు ఈ తనిఖీలు కొనసాగాయని, ఈ తనిఖీలో అక్రమ నగదు బట్వాడాలు జరిగినట్లు చెప్పేందుకు ఇప్పటిదాకా ఈడీ అధికారులు తగిన ఆధారాలపై ఎలాంటి ప్రకటనా చేయలేదని ఆరోపించారు. ఈ వాదనలపై న్యాయమూర్తులు స్పందిస్తూ టాస్మాక్ కార్యాలయాన్ని మూడు రోజులపాటు ఈడీ అధికారులు తమ ఆధీనంలో ఉంచుకోవడానికి వీలుందా? మూడు రోజులపాటు జరిపిన తనిఖీలకు సంబంధించిన సీసీ ఫుటేజీ ఆధారాలున్నాయా? రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అని తెలిసి, ప్రభుత్వ అనుమతి లేకుండా మీరంతట మీరే తనిఖీలు చేయడానికి వీలుందా? ముందస్తు నోటీసులిచ్చి తనిఖీలు జరిపారా? అని ఈడీ తరఫు న్యాయవాదులను ప్రశ్నించారు. సొలిసిటర్ జనరల్ సుందరేశన్ బదులిస్తూ టాస్మాక్ కార్యాలయానికి నోటీసు పంపి ఈ దాడులు చేసినట్లు తెలిపారు. న్యాయమూర్తులు మళ్ళీ జోక్యం చేసుకుంటూ ఈడీ అధికారులు ఏయే సమయాల్లో తనిఖీలు జరపాలో ముంబాయి హైకోర్టు స్పష్టం చేసిందని, రాత్రిపూట తనిఖీలు జరుపకూడదని ఉత్తర్వులిచ్చిందని, అలాంటిది అధికారం ఉంది కదా అని ప్రభుత్వ సంస్థను మూడు రోజులపాటు మీ ఆధీనంలో ఉంచుకోవడమా న్యాయమేనా? అని ప్రశ్నించారు. మూడు రోజలపాటు టాస్మాక్ ఉద్యోగులు , సిబ్బందిని ఇళ్లకు కూడా పంపకుండా ఎలా తనిఖీలు జరిపారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీలకు సంబంధించి సీసీ ఫుటేజీ వీడియో ఆధారాలు ఉన్నాయని అడ్వకేట్ జనరల్ బదులిచ్చారు. ప్రభుత్వ తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి జోక్యం చేసుకుంటూ ఉద్యోగుల మొబైల్ ఫోన్లు, డిజిటల్ వస్తువులను కూడా తీసుకెళ్ళారని తెలిపారు. న్యాయమూర్తులు స్పందిస్తూ ఈ పిటిషన్‌కు సంబంధించి ఈడీ అధికారులు సోమవారం లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని, అంత వరకూ టాస్మాక్ సంస్థపై తనిఖీలకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోకూడదని, టాస్మాక్ ఉద్యోగులపై కూడా ఎలాంటి చర్యలు చేపట్టరాదని ఆదేశించి, ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేశారు.

ఎమ్మెల్యే వేల్‌మురుగన్ దురుసు ప్రవర్తన

- ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం స్టాలిన్

ప్యారీస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో దురుసుగా ప్రవర్తించిన తమిళగ వాల్వురిమై కట్చి అధ్యక్షుడు, ఎమ్మెల్యే వేల్ మురుగన్‌పై సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల్‌మురుగన్ ఈ బడ్జెట్ సమావేశాల్లో తన నియోజకవర్గానికి సంబంధంలేని అంశాలను కూడా ప్రస్తావించడం సరికాదని ముఖ్యమంత్రి మందలించారు. రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లపై నాలుగో రోజైన గురువారం కూడా చర్చ జరిగింది. ఇందులో పాల్గొన్న సభ్యులు తమ నియోజకవర్గాల్లో తిష్టవేసిన సమస్యల గురించి ప్రస్తావించగా, సంబంధిత శాఖల మంత్రులు సమాధానం చెప్పారు. ముందుగా సభలో కులాల వారీ జనగణనపై జరిగిన చర్చలో పీఎంకే ఎమ్మెల్యే జీకే మణి పాల్గొని ఈ అంశంపై ప్రభుత్వం పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు మంత్రి మెయ్యనాథన్ కులగణన నిర్వహించే అధికారం కేంద్రప్రభుత్వానికే ఉందన్నారు. మధ్యలో జోక్యం కలుగజేసుకున్న వేల్‌మురుగన్, కులగణనను రాష్ట్రప్రభుత్వాలు నిర్వహించకూడదని సుప్రీంకోర్టు చెప్పలేదని ప్రభుత్వాన్ని విమర్శించేలా వ్యాఖ్యానించారు. అంతటితో ఊరుకోకుండా రాష్ట్రంలో కులగణన నిర్వహించడంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తంచేస్తూ, లేచి నిలబడి మంత్రులను వేలెత్తి చూపుతూ, దురుసుగా వ్యవహించడంతో పాటు, స్పీకర్ అప్పావు పోడియం వద్దకు వెళ్లి తనకు మాట్లాడేందుకు అనుమతించాలని కోరి, అనుమతించకపోవడంతో ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సభా మర్యాదలను గౌరవించకుండా సభాపతి పట్ల అమర్యాదగా ప్రవర్తించిన వేల్‌మురుగన్ చర్యలతో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆగ్రహం చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే వేల్‌మురుగన్ అసెంబ్లీలో వ్యవహరిస్తున్న తీరు సభ్యులందరిని అవేదనకు గురిచేసిందని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవల్సిందిగా స్పీకర్ అప్పావుకు విజ్ఞప్తి చేశారు. అధికార డీఎంకే కూటమి తరుఫున 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కడలూరు జిల్లా పన్రుట్టి నియోజకవర్గంలో ఉదయించే సూర్యుని గుర్తుపై పోటీ చేసి వేల్‌మురుగన్ గెలుపొందడం గమనార్హం.



ఎమ్మెల్యే వేల్‌మురుగన్

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:26 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:31 (శనివారం ఉదయం)

సమాచార దర్శిని

డ్రైవర్, కండక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఖాళీగా ఉన్న 3,274 డ్రైవర్, కండక్టర్ పోస్టులకు శుక్రవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు రోడ్డు రవాణా సంస్థ విడుదల చేసిన ప్రకటనలో... టెన్త్ ఉత్తీర్ణులై తమిళం చదవడం, రాయడం తెలిసి ఉండాలి. అభ్యర్థులు 24 ఏళ్ల పూర్తయినవారై ఉండాలి. జనరల్ విభాగాల అభ్యర్థులు 40 ఏళ్లలోపు, బీసీ, ఓబీసీ, మైనార్టీ విభాగాల అభ్యర్థులు 45 ఏళ్ల, ఇతర విభాగాలు 55 ఏళ్లలోపున్న వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ విభాగాల వారు రూ.590 (18 శాతం జీఎస్టీ కలిపి), ఇతర విభాగాల వారు రూ.1,180 రుసుముతో శుక్రవారం నుంచి ఏప్రిల్ 2వ తేది వరకు http://arasubus.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని రవాణా సంస్థ తెలియజేసింది.

29న నందనం కళాశాలలో జాబ్ మేళా

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందనంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 29వ తేది ప్రైవేట్ జాబ్ మేళా జరుగనుంది. చెన్నై జిల్లా ఎంప్లాయ్‌మెంట్, కెరీర్ గైడెన్స్ కార్యాలయ పర్యవేక్షణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరంలో 200లకు పైగా కర్మాగారాలు, సంస్థలు పాల్గొని సుమారు రెండువేల పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 8వ తరగతి నుంచి ఇంజనీరింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు, టైలరింగ్ శిక్షణ పూర్తిచేసిన వారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన వారు www.tnprivatejobs.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవచ్చని జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

రేపటి నుంచి బిజ్‌ఫేర్ ఎక్స్‌పో-2025

అడయార్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలోని ప్రముఖ నక్షత్ర హోటల్‌లో బిజ్‌ఫేర్ ఎక్స్‌పో-2025 పేరుతో చెన్నైస్ ప్రీమియర్ బిజినెస్ నెట్‌వర్కింగ్ సమావేశం జరుగనుంది. ఈ నెల 22, 23వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తేనాంపేటలోని హయ్యత్ రీజెన్సీ హోటల్‌లో జరుగనుంది. ఈ యేడాదిలో జరిగే అతిపెద్ద బిజ్‌ఫేర్ ఎక్స్‌పో ఇదేనని నిర్వాహకులు వెల్లడించారు. ఇందులో 80కి పైగా పవర్ ప్యాక్డ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తారని నిర్వాహకులు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.

26 నుంచి 'సోలార్ పవర్ ఇన్‌స్టాలేషన్'పై శిక్షణ

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 12వ తేది వరకు సోలార్ పవర్ ఇన్‌స్టాలేషన్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. సౌరశక్తి వ్యవస్థాపకత ప్రాథమిక అంశాలు, సౌర పరిశ్రమ, మార్కెట్, సోలార్ పీవీ సిస్టమ్స్, ప్లాంట్ ఏర్పాటుకు సబ్సిడీ, బ్యాంక్ రుణాలు సహా పలు అంశాలపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లకు పైబడిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈకాట్టు తాంగళ్‌లోని సంస్థ శిక్షణ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. సంస్థ ప్రాంగణంలో తక్కువ అద్దెతో బస, భోజనం వసతి కల్పించనున్నారు. వివరాలకు 8668108141, 8668102600 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

'పింక్ ఆటో' పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో మహిళలకు సురక్షిత ప్రయాణం నిర్ధారించేలా 'పింక్ ఆటో' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. తొలివిడతగా ఈ నెల 8న వంద మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పింక్ ఆటోలు అందజేశారు. తాజాగా రెండో విడత ఆటోలు పొందేందుకు ఆసక్తి కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. 20 నుంచి 45 ఏళ్లలోపుండి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన చెన్నైకి చెందిన మహిళలు 'చెన్నై జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, 8వ అంతస్తు, సింగారవేలర్ మాలిగై, చెన్నై-600001' అనే చిరునామాలో ఏప్రిల్ 6వ తేది లోపు దరఖాస్తులు సమర్పించాలని చెన్నై జిల్లా యంత్రాంగం ప్రకటించింది.

రంజాన్ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06077 చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి ప్రత్యేక రైలు ఈ నెల 22,26,29 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 11.45 గంటలకు బయల్దేరి మూడో రోజు ఉదయం 7.15 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06078 సంత్రాగచ్చి- చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 24,28,31 తేదీల్లో సంత్రాగచ్చి నుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

వేసవి ప్రత్యేక రైళ్లు

వేసవి సెలవుల దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణా రాష్ట్రం చర్లపల్లి నుంచి కన్నియాకుమారి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.07230 చర్లపల్లి-కన్నియాకుమారి వారాంతపు ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 2,9,16,23,30, మే 7,14,21,28, జూన్ 4,11,18,25 (గురువారం) తేదీల్లో చర్లపల్లి నుంచి రాత్రి 9.50 గంటలకు బయల్దేరి మూడో రోజు వేకువజామున 2.30 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.07229 కన్నియాకుమారి-చర్లపల్లి వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 4,11,18,25, మే 9,16,23,30, జూన్ 6,13,20,27 (శుక్రవారం) తేదీల్లో కన్నియాకుమారి నుంచి తెల్లవారుజామున 5.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.40 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లు గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుత్తణి, కాట్పాడి, తిరువణ్ణామలై మీదుగా వెళ్లనున్నాయి.

పన్నుల వసూలు కోసం సాత్తూరు మున్సిపాలిటీ వినూత్న యత్నం



సాత్తూరు మెయిన్‌రోడ్డులో షోరూమ్ వద్ద నిలిపిన మురుగునీటి ని తొలగించే ట్యాంకర్

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా సాత్తూరు మున్సిపల్ అధికారులు యేళ్లతరబడి వృత్తి పన్ను, ఆస్తిపన్ను చెల్లించని వాణిజ్య సంస్థల నుండి బకాయిల వసూలుకు కొత్త కొత్త మార్గాలను అమలు చేస్తున్నారు. పన్ను చెల్లించని దుకాణాల తలుపులపై నోటీసులు అతికించడం, దుకాణాల ఎదుట చెత్త కుప్పలు వేసి తొలగించకపోవడడం వంటి చిట్కాలను అమలు చేస్తున్నారు. ఈ రీతిలోనే సాత్తూరు మెయిన్ రోడ్డులో ఉన్న ద్విచక్రాల వాహనాల షోరూమ్ నిర్వాహకులు రూ.1.20లక్షల మేర మునిసిపాలిటీకి వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంది. ఆ షోరూమ్ నిర్వాహకులకు నోటీసులు పంపినా పన్ను చెల్లించలేదు. దీనితో మున్సిపల్ అధికారులు మురుగునీటిని తొలగించే ట్యాంకర్ లారీని ఆ షోరూమ్ ఎదుట నిలిపారు. దీంతో ఆ షోరూమ్‌కు వెళ్లే కస్టమర్లు మురుగునీటి వాహనం నుండి వచ్చే దుర్గంధం భరించలేక తిరిగి వెళ్ళిపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ఎన్నిసార్లు నోటీసులిచ్చినా వృత్తిపన్ను, ఆస్తి పన్ను చెల్లించని సంస్థలు నగరంలో చాలా వరకు ఉన్నాయని, పన్ను బకాయిల వసూళ్లు ఈ నెలాఖరులోగా చేయాల్సిన ఒత్తిడి కూడా తమపై ఉందని, కనుకనే పన్ను వసూళ్లకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని వివరించారు.

వండలూరు జూ పార్క్‌లో జంతువులకు ప్రత్యేక వసతులు


ఏనుగులకు ఏర్పాటుచేసిన షవర్ బాత్

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్‌లో జంతువులకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్రంలో ఫిబ్రవరి చివరి వారం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, వండలూరు జూలో ఉన్న జంతువులు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఏనుగులు, పులులు, చిరుతపులులు ఉండే బోనుల్లో పైపులు ఏర్పాటుచేసి నీళ్లు పడే విధంగాను, పక్షులు, మరికొన్ని జంతువులపై రోజుకు మూడు వేళలా నీళ్లు పిచికారీ చేస్తున్నారు. కాగా, షవర్ బాత్ కింద ఏనుగులు స్నానం చేస్తున్న దృశ్యాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

సీఎం గృహ పునర్నిర్మాణ పథకానికి రూ.600 కోట్లు

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఇంటి పునర్నిర్మాణ పథకం కింద 25 వేల ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేదీ ఉత్తర్వులు జారీచేశారు. 2024-25, 2025-25 ఆర్థిక సంవత్సరాల్లో రూ.1,954.20 కోట్ల అంచనా వ్యయంతో 2,57,006 ఇళ్ల మరమ్మతులకు గత మార్చిలో పరిపాలనా ఆమోదం లభించగా, అందులో 1,46,634 ఇళ్లకు రూ.1,041.32 కోట్ల కేటాయించారు. ఈ క్రమంలో, 2000-01 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల ద్వారా నిర్మించి ప్రస్తుతం దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మించేందుకు నిధులు అందజేస్తామని ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకటించారు. ఆ ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.25,000 ఇళ్ల పునర్నిర్మాణానికి రూ.600 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో... కిలాంబాక్కం టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ ప్రాంతాలకు ఈ నెల 21వ తేది (శుక్రవారం) 270 బస్సులు, 22న (శనివారం) 275 బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 21.22 తేదీల్లో తలా 50 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి 21,22 తేదీల్లో తలా 20 బస్సులు నడుపనున్నారు. అలాగే, సెలవులు ముగిసి నగరానికి తిరిగొచ్చేందుకు అదనపు బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

'బ్యాడ్ టచ్...గుడ్ టచ్'పై విద్యార్థులకు అవగాహన

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) లైంగిక వేధింపులు అడ్డుకునేలా 'బ్యాడ్ టచ్...గుడ్ టచ్'పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు జిల్లా ప్రధాన విద్యాధికారులు జారీచేసిన సర్క్యులర్‌లో... పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన బోధన సహా పలు అంశాలపై చర్చించేలా పాఠశాల స్థాయిలో తల్లిండ్రులు,ఉపాధ్యాయుల కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 26వ తేది నిర్వహించనున్న సమావేశంలో, లైంగిక వేధింపుల నుంచి రక్షించకోవడం, గుడ్ టచ్...బ్యాడ్ టచ్ తదితర విషయాలను విద్యార్థులకు తెలియజేయాలని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.

కొడనాడు వ్యవహారంలో 'ఇంటర్‌పోల్' నివేదిక

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కొడనాడు హత్యకు సంబంధించి 'ఇంటర్‌పోల్' విచారణ నివేదిక కోసం వేచి ఉన్నామని ప్రభుత్వం తరఫున తెలియజేశారు. ఊటీ సెషన్స్ కోర్టులో కొడనాడు హత్య, దోపిడీ కేసు విచారణ సాగుతోంది. ఏడేళ్లుగా కొనసాగుతున్న ఈ కేసు విచారణ సీబీసీఐడీకి అప్పగించారు. ఈ కేసు బుధవారం న్యాయమూర్తి మురళిధరన్ విచారించారు. ఈ కేసులో నేరారోపణ ఎదుర్కొంటున్న జితిన్ జాయ్ విచారణకు హాజరయ్యాడు. హత్య, దోపిడీ కేసు విచారణ కొనసాగుతోందని, ఇంటర్‌పోల్ విచారణ నివేదిక ఇంకా లభించలేదని, అందువల్ల అదనపు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాదులు షాజహాన్, కనకరాజ్ న్యాయమూర్తిని అభ్యర్థించారు. ప్రభుత్వ విజ్ఞప్తి పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, కేసు తదుపరి విచారణ ఏప్రిల్ 23వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రాష్ట్ర సరిహద్దులో కుక్కలు వదిలిన కేరళ యువకుడు

● రూ.2 లక్షల జరిమానా విధించిన అధికారులు

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దులో కుక్కలను వదిలిన కేరళ యువకుడికి అధికారులు రూ.2 లక్షల జరిమానా విధించారు. కన్నియాకుమారి జిల్లాలోని తమిళనాడు-కేరళ సరిహద్దు మార్గంలో బుధవారం సాయంత్రం ఓ వాహనంలో వచ్చిన యువకుడు 20 కుక్కలను ఆ ప్రాంతంలో వదిలేందుకు యత్నించాడు. గమనించిన స్థానికులు, అతడి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని, యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించి, రూ.2 లక్షల జరిమానా విధించారు.

తెలుగులో మాట్లాడినా మావైపు కన్నెత్తి చూడరు!

పొల్లాచ్చి జయరామన్‌పై మంత్రి నెహ్రూ ఎద్దేవా

చెన్నై,మార్చి20(ఆంధ్రజ్యోతి):తమిళంతోపాటు తెలుగులో మాట్లాడినా మాజీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్ తనవైపు కన్నెత్తి చూడలేదని నగర పాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ యెద్దేవా చేశారు. శాసనసభలో గురువారం ఉదయం పొల్లాచ్చి జయరామన్ మాట్లాడుతూ పొల్లాచ్చి నగరంలో భూగర్భ డ్రైనేజీ పథకంలో 22వేల ఇళ్ళకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా ఏడువేల ఇళ్ళకు మాత్రమే ఇచ్చారని, తక్కిన ఇళ్ళకు కూడా కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రి కేఎన్ నెహ్రూ సమాధానమిస్తూ తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పొల్లాచ్చి జయరామన్ డిప్యూటీ స్పీకర్‌గా తమ వైపు కన్నెత్తి కూడా చూడలేదని, చివరకు ఆయనకు బాగా తెలిసిన తెలుగులో మాట్లాడినా ప్రయోజనం లేదని యెద్దేవా చేయడంతో సభలో అటు పాలకపక్షం, ఇటు ప్రతిపక్ష సభ్యులు గొల్లుమన్నారు. ఆ తర్వాత మంత్రి నెహ్రూ మాట్లాడుతూ పొల్లాచ్చిలో పెండింగ్‌లో ఉన్న 15 వేల మందికి త్వరలోనే భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో సహాయాల పంపిణీ


పేదలకు అన్నదానం చేస్తున్న రాజేష్ తదితరులు

ప్యారీస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడి ముల్లైనగర్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతిని పురస్కరించుకుని అన్నాడీఎంకే ఆధ్వర్యంలో పేదలకు సంక్షేమ సహాయాల పంపిణీ, అన్నదాన కార్యక్రమం గురువారం జరిగింది. జయలలిత పేరవై ఉత్తర చెన్నై జిల్లా కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ డి.శరవణన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో అన్నాడీఎంకే ఉత్తర చెన్నై జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 500 మంది మహిళలకు వంటపాత్రలు, చీరలు, విదార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ చేసి, మధ్యాహ్న అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రేపు ఎంఎన్ఎం కార్యవర్గ సమావేశం

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) కార్యవర్గసమావేశం శనివారం జరుగనున్నాయి. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణాచలం విడుదల చేసిన ప్రకటనలో.. పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ అధ్యక్షతన ఆళ్వార్‌పేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగనుంది. ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ రాజకీయాలు, రాబోయే అసెంబ్లీ ఎన్నికలు, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం తదితరాలపై చర్చించనున్నట్లు ఎంఎన్ఎం తెలియజేసింది.

డీఎంకే జెండా కొయ్యలు తొలగింపు


మదురైలో 60 అడుగుల జెండా స్తంభాన్ని తొలగిస్తున్న డీఎంకే శ్రేణులు

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జెండా స్తంభాలను డీఎంకే శ్రేణులు తొలగిస్తున్నారు. రోడ్డు పక్కన, బహిరంగ ప్రాంతాల్లో ప్రజలు, ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న పార్టీల జెండా స్తంభాలు తొలగించాలని హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఉత్తర్వులతో, రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ ప్రాంతాల్లో ఉన్న జెండా స్తంభాలు 15 రోజుల్లో తొలగించాలని డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ బుధవారం ఆదేశించారు. దీంతో, గురువారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు జెండా స్తంభాలు తొలగింపు ప్రారంభించారు. మదురై కార్పొరేషన్ 58వ వార్డు పరిధిలోని మేలపొన్నాగరం మెయిన్ రోడ్డులో 50 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన 60 అడుగుల భారీ జెండా స్తంభాన్ని గురువారం డీఎంకే కౌన్సిలర్ ఎం.జయరామన్ సమక్షంలో కార్యకర్తలు తొలగించారు.

● బాలుడికి లైంగిక వేధింపులు....

వృద్ధుడికి 25ఏళ్ళ జైలు శిక్ష

ప్యారీస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా కంబం సమీపంలో ఓ ప్రాంతానికి చెందిన దివ్యాంగుడైన 17ఏళ్ళ బాలుడిని లైంగికంగా వేధించిన 60ఏళ్ళ వృద్ధుడికి జిల్లా మహిళా సెషెన్స్ కోర్టు 25ఏళ్ళ జైలుశిక్ష విధిస్తూ తీర్పువెలువరించింది. ఆ బాలుడు గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండటం గుర్తించిన అతని తల్లిదండ్రులు గత ఏడాది జూన్ 8వ తేదీన ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన సమయంలో ఆ బాలుడు 60ఏళ్ళ వృద్ధుడు తనను లైంగికంగా వేధిస్తున్నట్లు వైద్యుల వద్ద వాపోయాడు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు వృద్ధుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ పూర్తయిన నేపథ్యంలో, బుధవారం తేని జిల్లా మహిళా సెషెన్స్ కోర్టు న్యాయమూర్తి గణేశన్ నిందితుడికి 25ఏళ్ళ జైలుశిక్షతో పాటు రూ.25వేలు జరిమానాను విధిస్తూ తీర్పువెలువరించారు.

అదుపుతప్పిన అరటిపండ్ల వాహనం

● ఒకరి మృతి, ఏఎస్సైకు తీవ్రగాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా ఏఎస్సై

తిరుత్తణి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని మురుగన్‌పట్టిలో రోడ్డుపై వేగంగా వస్తున్న అరటిపండ్ల వాహనం అదుపుతప్పిన ఘనటలో ఒకరు మృతిచెందగా, ఓ మహిళా ఏఎస్సై గాయపడి ఆసుపత్రి పాలైంది. వివరాల్లోకి వెళ్తే గురువారం ఉదయం చెన్నై - తిరుపతి నేషనల్ హైవేపై ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్న అరటిపండ్ల కార్గో వాహనం అదుపుతప్పింది. అదే సమయంలో రోడ్డుపై ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఏఎస్సై మెర్సీ (35), గోవర్ధన్ (32)లను ఆ వాహనం ఢీకొనడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్ డ్రైవర్ పరారయ్యాడు. గాయపడిన వారిని స్థానికులు తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో గాయపడిన గోవర్ధన్ అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందగా, తలకు తీవ్రగాయాలైన మహిళా ఏఎస్సై మెర్సీకి ప్రాథమిక చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం ఆమె కుటుంబసభ్యులు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతిచెందిన గోవర్ధన్ ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా నగరికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

లంచం సొమ్ముతో చెరువులో దూకిన వీఏఓ

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ అధికారులకు భయపడి లంచం సొమ్ముతో చెరువులో దూకిన వీఏఓపై సస్పెన్షన్ వేటు పడింది. కోవై తొంబులిపాళయానికి చెందిన కృష్ణస్వామి వారసత్వ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.5,000 లంచం ఇవ్వాలని మాదవరాయపురం వీఏఓ వెట్రివేల్ డిమాండ్ చేశారు. తొలుత రూ.1,000 అందజేసిన కృష్ణస్వామి, ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల సూచనలతో రూ.3,500 విలువైన రసాయనాలు పూసిన కరెన్సీని బుధవారం వెట్రివేల్‌కు అందిస్తుండగా అక్కడే మకాం వేసిన అధికారులు వెట్రివేల్‌ను పట్టుకొనేందుకు యత్నించారు. అంతలో అతను అధికారులకు చిక్కకుండా బైక్‌పై పరారయ్యాడు. అధికారులు మరో వాహనంలో అతడిని వెంబడించగా శివారు ప్రాంతంలో ఉన్న చెరువులో దూకాడు. అధికారులు అతడిని అరెస్ట్ చేసి, చెరువులో పడిన నగదు కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, వీఏఓ వెట్రివేల్‌ను జిల్లా అధికారులు గురువారం సస్పెండ్ చేశారు.

తిరుత్తణిలో బస్సు అద్దాలను ధ్వంసం చేసిన విద్యార్థులు


అద్దాలు పగిలిన బస్సును డిపోకు తరలిస్తున్న పోలీసులు

తిరుత్తణి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని అరుంగుళం గ్రామంల కొంతమంది ప్లస్‌వన్ విద్యార్థులు బస్సు అద్దాలు పగులగొట్టి గలాటా చేశారు. బుధవారం సాయంత్రం అరుంగుళం గ్రామం నుండి బయల్దేరిన ప్రభుత్వ బస్సు, నరసమంగళం గ్రామానికి చేరుకోగానే కొంతమంది ప్లస్‌వన్ విద్యార్థులు బస్సులో ఎక్కారు. అనంతరం కాశీనాథపురం జంక్షన్‌లో మరికొంతమంది విద్యార్థులు బస్సు ఎక్కగా, కాసేపటికి ఈ రెండు గ్రామాల విద్యార్థుల మధ్య గొడవ ప్రారంభమైంది. గమనించిన కండక్టర్ విద్యార్థులను మందలించే ప్రయత్నం చేయగా, ఆ కండక్టర్‌పై దురుసుగా ప్రవర్తించి, అనుచిత పదజాలంతో దుర్భాషలాడారు. దీంతో బస్సు డ్రైవర్ అగస్త్రీశ్వరర్ బస్సును ఆపేసి విద్యార్థులను దింపేశాడు. ఇంతలో వారిలో కొంతమంది విద్యార్థులు ఆయుధాలతో బస్సుపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో బస్సు వెనుక అద్దం పూర్తిగా ధ్వంసమైంది.. ఇంతలో ఈ సమాచారం అందుకున్న తిరుత్తణి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగానే, విద్యార్థులందరూ పక్కనేవున్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలోకి పారిపోయారు. ఈ విద్యార్థులు చెన్నైలోని రాధాకృష్ణన్ గవర్నమెంట్ బాయ్స్ సెకండరీ పాఠశాల విద్యార్థులని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, కండక్టర్ తీసిన వీడియో ఆధారంగా విద్యార్థులను గాలిస్తున్నారు.

పళని ఆలయంలో భక్తుడి మృతి


రామేశ్వరంలో భక్తుడి మృతి సంఘటనను ఖండిస్తూ ధర్నా చేస్తున్న హిందూ మున్నాని నేతలు

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పళని దండాయుధపాణి స్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న నామక్కల్ జిల్లా మోహనూరుకు చెందిన సెల్వమణి అనే భక్తుడు గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం పళని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక ఆయన మృతి చెందాడు. కొద్ది రోజుల క్రితం తిరుచెందూరు ఆలయం వద్ద ఓ భక్తుడు గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇక మంగళవారం రామేశ్వరం ఆలయంలోనూ ఉత్తరాదికి చెందిన భక్తుడు మృతి చెందాడు. ఇలా వరుసగా ఆలయాల వద్ద భక్తులు గుండెపోటుకు గురై మృతి చెందటం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా రామేశ్వరం ఆలయంలో ఉత్తరాది భక్తుడు మృతి చెందిన సంఘటనను ఖండిస్తూ హిందూ మున్నాని నేతలు, కార్యకర్తలు గురువారం ధర్నా నిర్వహించారు.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ గోదాముల్లో బీఐఎస్ అధికారుల తనిఖీలు

● రూ.36 లక్షల విలువైన వస్తువుల స్వాధీనం

ప్యారీస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలోని అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ గోదాముల్లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారులు గురువారం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో రూ.36 లక్షల విలువైన వస్తువుల స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని పుదువాయిల్ ప్రాంతంలోవున్న అమెజాన్ , అదేవిధంగా కొడువల్లి ప్రాంతంలోవున్న ఫ్లిప్‌కార్ట్ గోదాముల్లో బీఐఎస్ ముద్రలేకుండా తినుబండారాలు, పిల్లల బొమ్మలు, శీతలపానీయాలు, సీలింగ్ ఫ్యాన్లు తదితరాలను ఉంచారు. వీటిని ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్న ఈ సంస్థలపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లాలోని బీఐఎస్ అధికారులకు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఉదయం సీఐఎస్ఎఫ్ బలగాల భద్రత నడుమ సుమారు పది మంది బీఐఎస్ అధికారులు ఏకకాలంలో ఆ రెండు గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

ఆగని శ్రీలంక నావికాదళం దాడులు

● 11 మంది పాంబన్ జాలర్ల అరెస్టు

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం తమిళజాలర్లపై దాడులు కొనసాగిస్తూనే ఉంది. అరెస్టయిన జాలర్లను, వారి పడవలను విడిపించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రధాని నరేంద్రమోదీకి, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జయశంకర్‌కు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోతోంది. అరెస్టయిన జాలర్లకు శ్రీలంక కోర్టులు లక్షలాది రూపాయల జరిమానా, ఆరునెలలకు పైగా జైలు శిక్ష విధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా బంగాళాఖాతంలో కచ్చాదీవి- నెడుదీవికి మధ్య గురువారం వేకువజామున పాంబన్ ప్రాంతానికి చెందిన 11 మంది జాలర్లు చేపలు పడుతుండగా శ్రీలంక నావికాదళం గస్తీ నౌకలో వచ్చి తమ దేశ సముద్ర సరిహద్దు జలాల్లోకి ప్రవేశించారంటూ వారిపై దాడి చేసింది. ఆ తర్వాత జాలర్లను మంధించి, వారికి చెందిన రెండు మరపడవలను స్వాధీనం చేసుకుంది. జాలర్లను, మరపడవలను శ్రీలంక నావికాదళం శ్రీలంక కాంగేశన్ రేవులో ఉన్న నావికాదళ శిబిరానికి చేర్చి కోర్టులో హాజరుపరిచింది. పాంబన్‌కు చెందిన 11 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం నిర్బంధించినట్లు తెలుసుకుని ఆ ప్రాంతానికి చెందిన జాలర్ల సంఘం నాయకులు రాష్ట్ర మత్స్యశాఖకు ఫిర్యాదు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని జాలర్లను విడిపించాలని జాలర్ల సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

విగ్రహాల స్మగ్లింగ్ నిరోధక విభాగం ఐజీగా లక్ష్మి నియామకం

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విగ్రహాల అక్రమ తరలింపు నిరోధక విభాగం ఐజీగా లక్ష్మి నియమితులయ్యారు. రాష్ట్రంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ గురువారం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం, విగ్రహాల అక్రమ తరలింపు నిరోధక విభాగం ఐజీగా వ్యవహరించిన ప్రవేష్‌కుమార్ చెన్నై నార్త్ అడిషినల్ కమిషనర్‌గా, ఆయన స్థానంలో పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఐజీ లక్ష్మిని నియమించారు., చెన్నై నార్త్ అడిషినల్ కమిషనర్ నరేంద్ర నాయర్, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఐజీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

చెరకు టన్నుకు రూ.4,000

● వచ్చే ఏడాది నుంచి అమలు

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది నుంచి చెరకు టన్నుకు రూ.4,000 అందజేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే పాలనలో కొత్తగా 1.80 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడంతో, సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయిన రైతులకు రూ.1,642 కోట్ల మేర పరిహారం అందజేసినట్లు తెలిపారు. అన్నాడీఎంకే ప్రభుత్వం చెరకు టన్నుకు రూ.3,500లుగా నిర్ణయించిందని, డీఎంకే ప్రభుత్వం ఈ ధరను రూ.4,000లకు పెంచి వచ్చే ఏడాది నుంచి అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

శింబు చిత్రంలో సంతానం...!



శింబు హీరోగా నటించే చిత్రంలో హాస్య నటుడు సంతానం ఓ కీలక పాత్ర పోషించనున్నారు. తన 49వ చిత్రాన్ని 'పార్కింగ్' ఫేం రామ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కించనున్నారు. ఇందులో తన పాత్రకు సమానంగా సంతానంకు ప్రత్యేకంగా రోల్ ఇచ్చి, నటింపజేసేందుకు శింబు నిర్ణయించుకున్నారు. దీంతో సంతానం కూడా శింబు చిత్రంలో నటించేందుకు ఒప్పుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం శింబు 49 చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక సాగుతుంది. ఈ చిత్రంలో ఇంకా హీరోయిన్ ఎంపిక కాలేదు. కాగా ప్రస్తుతం సంతానం పలు చిత్రాల్లో హీరోగా నటిస్తున్నారు. దీంతో ఇతర హీరోల చిత్రాల్లో నటించేందుకు సంతానం పెద్దగా మొగ్గు చూపడం లేదు. ఈ నేపథ్యంలో శింబు కొత్త చిత్రంలోని పాత్రకు మాత్రం సంతానాన్ని ఎంపిక చేయాలని దర్శకుడు పట్టుబట్టారు. హీరోతో సమానమైన ముఖ్య పాత్ర కావడంతో సంతానం కూడా సానుకూలంగా స్పందించినట్టు వార్తలు వస్తున్నాయి.



మమతా బైజు

మలయాళ యువ నటికి జాక్‌పాట్

మలయాళ యువ నటి మమతా బైజుకు జాక్‌పాట్ తగిలింది. ఇద్దరు అగ్రహీరోల చిత్రాల్లో నటించే అవకాశాన్ని ఆమె దక్కించుకున్నారు. ప్రముఖ హీరోలు సూర్య, ధనుష్ చిత్రాల్లో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. 'ప్రేమలు' అనే చిత్రంతో ఒక్కసారిగా పాపులర్ అయిన మమతా బైజు... ఆ తర్వాత జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించిన 'రెబల్' చిత్రంలో నటించారు. ఇపుడు విష్ణు విశాల్ హీరోగా తెరకెక్కుతున్న 'ఇరండు వానం' అనే చిత్రంలోనూ ఆమె కథానాయికగా నటిస్తున్నారు. అగ్రహీరో విజయ్ నటిస్తున్న 'జన నాయగన్' మూవీలోనూ ఆమె ఓ పాత్ర పోషిస్తున్నారు. ఇపుడు మరో రెండు తమిళ చిత్రాల్లో నటించేందుకు మమతా బైజు అంగీకరించారు. ఇందులో ఒకటి ధనుష్ హీరోగా 'పోర్‌తొళిల్' ఫేం విఘ్నేష్ రాజా రూపొందించే కొత్త చిత్రం కోసం ఆమెను ఎంపిక చేశారు. అలాగే, టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి - హీరో సూర్య కాంబినేషన్‌లో రూపొందే చిత్రంలోనూ ఆమె నటించనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.

ఇళయరాజాకు కోలీవుడ్ దర్శకుల సంఘం సత్కారం

తమిళ చిత్రజ్యోతి

ప్రముఖ సంగీత దర్శకుడు ఇసైజ్ఞాని ఇళయరాజాను కోలీవుడ్ దర్శకుల సంఘం అభినందించింది. ఇళయరాజా స్వయంగా రచించిన 'వలియంట్' పేరుతో రూపొందించిన సింఫనీని ఆయన ఇటీవల లండన్ వేదికగా అరంగేట్రం చేసిన విషయం తెల్సిందే. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకుని వచ్చిన ఇళయరాజా.. తొలుత ప్రధాని నరేంద్ర మోదీని కలుసుకుని, తన సింఫనీ గురించి వివరించారు. ఇపుడు చిత్రపరిశ్రమకు చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు ఇళయరాజాను కలుసుకుని, ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా తమిళ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్‌వీ ఉదయకుమార్, కోశాధికారి పేరరసు, సీనియర్ దర్శకులు పి.వాసు, కేఎస్ రవికుమార్, ఆర్‌కే సెల్వమణి తదితరులు గురువారం ఉదయం ఇళయరాజాను ఆయన స్టూడియోలో కలుసుకుని సత్కరించి అభినందనలు తెలియజేశారు.



ఇళయరాజాను సత్కరిస్తున్న దర్శకులు

కార్మికుల సంక్షేమం కోసం 'ఫెస్రా'

- ఆర్‌కే సెల్వమణి



సినీ నిర్మాణ కార్మికుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఫెఫ్సీ ఆధ్వర్యంలో 'ఫెస్రా' (ఎఫ్ఈఎస్ఆర్ఏ) అనే సంస్థ ఏర్పాటు చేయనున్నట్టు సినీ దర్శకుడు, దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మిక సంఘ సమాఖ్య ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి తెలిపారు. ఫెఫ్సీ కార్మికుల భవిష్యత్‌పై ఆయన మాట్లాడుతూ, 'చిత్రపరిశ్రమ వందేళ్ళు గడిచిపోయినప్పటికీ సినీ కార్మికులకు ఎలాంటి గుర్తింపు లేదు.సినీ కార్మికుడు నిర్మాత వద్ద పనిచేసినప్పటికీ 60 యేళ్ల తర్వాత రిటైర్డ్ అయితే ప్రభుత్వం లేదా నిర్మాతపరంగా ఎలాంటి సాయం అందడం లేదు. అసంఘటిత కార్మికులు కావడంతో పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు లేవు.ఈ విషయాన్ని నిర్మాత వద్ద ప్రస్తావిస్తే మాకెలాంటి సంబంధం లేదంటున్నారు. అందుకే ఫెఫ్సీ నుంచి కొత్తగా ఫెస్రా అనే సంస్థ ప్రారంభించి, ఆ సంస్థ తరపున ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు ఇతర ఆర్థిక సదుపాయాలను కల్పించాలని భావిస్తున్నాం. ఈ సంస్థలో 23 యూనియన్లకు చెందిన కార్మికులు సభ్యులుగా ఉంటారు. వీరికి 60 యేళ్ళ తర్వాత ఆర్థికంగా ఆదుకునేందుకు వీలు కలుగుతుంది' అని పేర్కొన్నారు.

తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ భక్తుడిని అనుగ్రహించడం కోసం అరటి చెట్టులో ప్రత్యక్షమైన దివ్యక్షేత్రమే 'వాళ మర బాలసుబ్రహ్మణ్యస్వామి' ఆలయం. విరుదునగర్ జిల్లా వెంబకోట సమీపం తులుక్కన్ కురిచ్చి గ్రామంలో ఉన్న ఆలయంలో స్వామివారు అరటిచెట్టు రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అంతే కాకుండా ఆలయంలో నిత్యం ప్రపంచ శాంతికోసం యాగం నిర్వహిస్తుండటం మరీ విశేషం. ప్రతినెలా కృత్తిక రోజు విరుదునగర్ పరిసర జిల్లాలకు చెందిన భక్తులు ఈ ఆలయాన్ని దర్శించేందుకు తరలివస్తుంటారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి



వెండి కవచ అలంకరణతో స్వామివారు



సర్వాలంకరణతో కనువిందు చేస్తున్న స్వామివారు



పళనియాండి రూపంలో స్వామివారు



వెండి కవచధారణతో మూలవిరాట్టు



స్వామివారి నిజరూప దర్శనం



ఆలయ ప్రవేశద్వారం

భక్తుల కోర్కెలు తీర్చే తీర్థం

- అరటిచెట్టులో ఆవిర్భవించిన బాల మురుగన్
- వివాహ, పుత్రదోషాలను తొలగించే దివ్యక్షేత్రం

'వాళ మర' దేవాలయం

ఆలయ విశేషాలు..

ఈ ఆలయం అందంగా చిన్న మంటపంలా ఉన్నప్పటికీ గర్భాలయంలో అరటిచెట్టులో ఆవిర్భవించిన రీతిలో బాలసుబ్రహ్మణ్యస్వామి భక్తులకు దర్శనమిస్తున్నారు. మురుగప్పెరుమాన్ ఆలయాలలో నిర్వహిస్తున్నట్లే ఆడికృత్తిక, తైకృత్తిక, తైపూసం తదితర ఉత్సవాలు ఇక్కడ కూడా నిర్వహిస్తున్నారు. ఈ స్వామివారిని దర్శించుకుంటే వివాహ, పుత్రదోషాలు తొలగుతాయని, విషకీటకాల వల్ల కలిగే బాధలు పటాపంచలవుతాయని, సంపూర్ణ ఆరోగ్యం ప్రాప్తిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

స్థలపురాణం..

సుమారు 150 సంవత్సరాల క్రితం తులుక్కన్ కురిచ్చి గ్రామంలో నేరియప్పర్ - వీరమ్మాళ్ దంపతుల కుమారుడు వేలాయుధం. రోజూ పొలం పనులు ప్రారంభించడానికి ముందు వెంబకోట వైప్పారులో స్నానమాచరించి వనమూర్తి లింగపురం వినాయకుడి ఆలయంలో మురుగప్పెరుమాన్‌ను దర్శించడం ఆనవాయితీగా పెట్టుకున్నాడు. అంతేకాకుండా వనమూలికలతో ప్రజలకు వైద్యం చేసేవారు. ఓ రోజు వేకువజామున లేచి స్నానమాచరించి మురుగప్పెరుమాన్‌ను దర్శించడానికి బయలుదేరినప్పుడు వైప్పారులో వరదలు సంభవించాయి. దీంతో ఆ వాగును దాటలేక స్వామివారిని దర్శించుకోలేకపోయాననే బాధతో ఇంటికి చేరుకున్నాడు. స్వామివారిని దర్శించలేదన్న వేదనతో ఏ పని చేయకుండా కూర్చుని స్వామివారి నామావళి పఠిస్తూ కునుకుతీశాడు. కలలో అతడి ఎదుట మురుగప్పెరుమాన్ ప్రత్యక్షమై నా దర్శనం కోసం అంత దూరం రావాల్సిన పనిలేదు. నేను నిన్ను వెదుక్కుంటూ వచ్చేశాను. నీవు ఆశగా పెంచుతున్న అరటితోటలోని చెట్లలో ఓ చెట్టులో పొడవైన అరటిగెల వేలాడుతుంటుంది. ఆ అరటి చెట్టులోనే ఉన్నాను దర్శించుకో అంటూ మాయమయ్యారు. మరుసటి రోజు వేలాయుధం స్నానమాచరించి తన అరటి తోటకు వెళ్ళిచూసినప్పుడు ఆ చెట్లలో ఒక చెట్టులో మాత్రమే పొడవైన అరటిగెల వేలాడుతుండటం కనిపించింది. ఆ కదళీవృక్షానికి పసుపుకుంకుమ దిద్ది, ఫలహారాలను నైవేద్యంగా పెట్టి హారతినిచ్చి వేలాయుధం 'మురుగా మురుగా' అంటూ భక్తిశ్రద్ధలతో పూజించాడు. ఈ రీతిలో వేలాయుధం రోజూ అరటి చెట్టును పూజిస్తున్నట్టు తెలుసుకుని గ్రామస్థులు కూడా ఆ అరటిచెట్టునే మురుగప్పెరుమాన్‌గా భావించి పూజించసాగారు. ఈ నేపథ్యంలో సేవలపట్టి జమీందారు తన కుమారుడి పెళ్ళి వేడుకలకు పొడవైన అరటిగెలలు ఉన్న రెండు అరటి చెట్లను తీసుకురమ్మని సిబ్బందిని పంపారు. ఆ సిబ్బంది ఆ గ్రామమంతటా ఉన్న అరటి తోటల్లో ఎంతవెదికినా గెలలతో ఉన్న అరటిచెట్లు కనిపించలేదు. చివరకు వేలాయుధం తోటలో మాత్రమే ఒక చెట్టులో అరటిగెల వేలాడుతుండటం చూశారు. జమీందారు సిబ్బంది వేలాయుధం వద్దకు వెళ్ళి ఆ అరటి చెట్టు ధర చెప్పమన్నారు. వేలాయుధం వెంటనే అది అరటిచెట్టు కాదని, తనను ఆదుకునే సుబ్రహ్మణ్యస్వామివారని చెప్పి ఆ చెట్టును అమ్మే ప్రసక్తే లేదని తెలిపాడు. దీంతో ఆ సిబ్బంది తిరిగివెళ్లి జమీందారుకు విషయం చెప్పారు. ఆ మాటలు విన్న జమీందారు కుమారుడు ఆగ్రహంతో ఆ చెట్టును తానే తీసుకువస్తానని చెప్పి, కత్తి పట్టుకుని వేలాయుధం అరటితోటకు వెళ్లాడు. పొడవైన గెల ఉన్న అరటిచెట్టుపై కత్తితో ఓ వేటు వేశాడు. అంతే... ఆ అరటిచెట్టు నుండి రక్తం కారసాగింది. వెంటనే అక్కడకు వేగంగా వచ్చిన విషసర్పం అతడిని కాటువేసింది. నురగలు కక్కుకుంటూ జమీందారు కుమారుడు నేలకు ఒరిగాడు. ఈ విషయం తెలుసుకున్న జమీందార వెంటనే అక్కడికి వెళ్ళి వేలాయుధాన్ని క్షమించమని వేడుకున్నాడు. వేలాయుధం తన చేతిలో బెత్తాన్ని జమీందారు కుమారుడి తలపై ఆనించి 'మురుగ.. మురుగా.. మురుగా..' అంటూ మూడుసార్లు ఆర్తితో పిలిచి మురుగప్పెరుమాన్‌ను వేడుకున్నాడు. దీంతో అప్పటిదాకా విగత జీవుడై పడి ఉన్న జమీందారు కుమారుడు సజీవుడై లేచి నిల్చున్నాడు. జమీందారు సంతసించి ఆ అరటి చెట్టుకు పూజలు చేసి వెనుతిరిగారు. ఆ తర్వాత అక్కడ స్వామివారికి అందమైన ఆలయం నిర్మించారు. ఈ ఆలయానికి అరటిచెట్టే ఇప్పటికే స్థలవృక్షం కొనసాగుతోంది.

ఆధ్యాత్మికం

ఎలా వెళ్ళాలి?

విరుదునగర్ జిల్లాలోని శివకాశి నగరానికి రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుండి బస్సులను నడుపుతున్నాయి. శివకాశికి 17 కిలోమీటర్ల దూరంలో వెంబకోట సమీపం తులుక్కన్ కురిచ్చి వద్దనున్న ఈ ఆలయానికి టౌన్ బస్సులు, ఆటోలు, టాక్సీలో చేరుకోవచ్చు. శివకాశి, సాత్తూరు, ప్రాంతాల నుండి కూడా తులక్కన్‌కురిచ్చికి టౌన్ బస్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుండి రాత్రి 8 గంటలవరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

డా. అగర్వాల్ హాస్పిటల్‌లో వృద్ధుడికి అరుదైన కార్నియా చికిత్స



చికిత్స అనంతరం కోలుకున్న వృద్ధుడితో డాక్టర్ అమర్ అగర్వాల్, డాక్టర్ అశ్విన్ అగర్వాల్, డాక్టర్ ఎస్.సౌందరి

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ ఆడుతూ కార్నియా దెబ్బతినటంతో తీవ్రంగా గాయపడిన మణి (67) అనే వృద్ధుడికి అగర్వాల్ ఐ హాస్పిటల్‌లో సంక్లిష్టమైన పిన్‌హోల్ పపిల్లో ప్లాస్టీ (పీపీపీ) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ అమర్ అగర్వాల్ తెలిపారు. ఆస్పత్రిలో గురువారం మధ్యాహ్నం ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్నియా మార్పిడి శస్త్రచికిత్స చేయడానికి కార్నియా దానం కోసం ఎక్కువ కాలం వేచి ఉండాల్సి వస్తుందని, అలాంటి తరుణంలో పిన్‌హోల్ పపిల్లో ప్లాస్టీ శస్త్రచికిత్సతో దృష్టిని పునరుద్ధరించవచ్చునని చెప్పారు. ప్రస్తుతం ఆ చికిత్స చేసుకున్న వృద్ధుడికి కంటిచూపు తిరిగొచ్చిందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ అశ్విన్ అగర్వాల్, డాక్టర్ సౌందరి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా సైటోరెడక్టివ్ శస్త్రచికిత్స



వైద్యుల బృందం

ప్యారీస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అధునాతన అపెండిక్స్ క్యాన్సర్ కోసం హెచ్ఐపీఈసీతో సంక్లిష్ట కణ పునరుత్పత్తి (సైటోరెడక్టివ్) శస్త్రచికిత్సను పూందమల్లిలోని బీవెల్ ఆస్పత్రి వైద్యులు విజయవంతం చేశారు. ప్రమీల దయాళ్ (47) అనే మహిళకు ఎదురైన ఆరోగ్య సమస్యలకు జరిగిన వైద్య పరిశోధనల్లో ఆమె అపెండిక్స్ క్యాన్సర్ సోకినట్లు తెలిసింది. దీనితో బీవెల్ ఆస్పత్రిలో చేరిన ఆమెకు వైద్యులు పది గంటలపాటు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స గురించి ఆసుపత్రి వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ వెట్రివేల్ మీడియాతో మాట్లాడుతూ, 12 ప్రదేశాల్లో సంక్లిష్ట శస్త్రచికిత్స చేయడానికి తమ శాఖల్లో అన్ని ఏర్పాట్లు సమకూర్చినట్లు ఆయన తెలిపారు.

రేపు బీ2బీ బయ్యర్ల సమావేశం



మీడియా సమావేశంలో పాల్గొన్న నిర్వాహకులు

అడయార్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న బీ2బీ బయ్యర్స్ సెల్లర్స్ మీట్ - ఇండస్ట్రీస్ ఎక్స్‌పర్ట్ నెట్‌వర్కింగ్ 28వ ఎడిషన్ మీటింగ్ జరుగనుంది. ఈరోడ్‌లోని పరిమళం హాలులో ఈ సమావేశం జరుగుతుందని ఈవెంట్ నిర్వాహకులు అజయ్ డి షా, జెఎం బాలాజీ, సుందరరాజ్, సి.దండాయుదపాణి గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశాన్ని పల్లవ గ్రూపు ఛైర్మన్ వీఎస్ పళనిస్వామి ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా ఏజీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఇండియన్ మ్యాన్‌మేడ్ యార్న్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్ నటరాజన్ పాల్గొంటారని వారు తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరు జరిగే ఈ సమావేశంలో దాదాపు 600 మంది బయ్యర్లు, ఇండస్ట్రీస్ ఎక్స్‌పర్టులు పాల్గొంటారని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం 5 గంటలకు సెమినార్ కూడా ఉంటుందని వెల్లడించారు.

కీల్పాక్‌లో 'లడ్డూస్' ఔట్‌లెట్



ఔట్‌లెట్ ప్రారంభోత్సవ దృశ్యం

అడయార్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నేతి మిఠాయిల తయారీలో ప్రత్యేక గుర్తింపు పొందిన లడ్డూస్ మిఠాయి షాపు కీల్పాక్కంలోని కీల్పాక్కం గార్డెన్ రోడ్డులో కొత్త ఔట్‌లెట్ ప్రారంభించింది. అడయార్ ఆనంద్ భవన్ స్వీట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఏటీ శ్రీనివాస రాజా చేతుల మీదుగా ప్రారంభించగా, లడ్డూస్ సహ వ్యవస్థాపకులు సౌరభ్ పాండే, చేతన్ లోధా తదితరులు హాజరయ్యారు. ఈ లడ్డూస్ ఔట్‌లెట్‌లో రుచికరమైన మిఠాయిలు సరసమైన ధరలకు విక్రయానికి అందుబాటులో ఉన్నాయి.



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఫ్రాన్స్ రాయబారి థియరీ మేథవ్, చెన్నైలోని ఆ దేశ డిప్యూటీ రాయబారి ఎటెన్నీ రోలాండ్ పీగ్ తదితరులు



బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు భారీగా నిధులు కేటాయించినందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్, వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్కేపన్నీర్‌సెల్వంను కలిసి ధన్యవాదాలు తెలియజేస్తున్న రాష్ట్ర రైతు సంఘాల నాయకులు, ప్రతినిధులు



హిందూ దేవాదాయ ఉన్నత మండలి సభ్యుడిగా నియమించినందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని ధన్యవాదాలు తెలుపుకుంటున్న మాజీ మంత్రి ఎస్. తంగవేలు

శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు బీజేపీ కుట్ర

- మంత్రి పీకే శేఖర్‌బాబు



ప్రజలకు అల్పాహారం అందిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీజేపీ నేతలు శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాల్లో దిగారని ఆ పార్టీ సీనియర్ నేత హెచ్.రాజా చీడపురుగులా సమాజాన్ని తొలచివేస్తున్నారని హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు విమర్శించారు. అమంజికరై ప్రాంతంలోని అంబేడ్కర్ గ్రౌండులో గురువారం ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన వేడుకల సందర్భంగా ఎగ్మూర్ డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతిభద్రతకే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం నేరాలను అరికట్టేందుకు చేపడుతున్న చర్యలకు భయపడి నేరస్థులు పొరుగు రాష్ట్రాలకు పరారవుతున్నారని తెలిపారు. స్కాట్‌లాండ్ పోలీసులకు దీటుగా రాష్ట్రపోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేస్తున్నందున రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, ఇది చూసి ఓర్వలేని మతవాద బీజేపీకి చెందిన పలువురు నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడానికి, శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాల్లో దిగారని వ్యాఖ్యానించారు. ఈ నాలున్నరేళ్ళ డీఎంకే పాలనలో ఇప్పటివరకు 2,700లకు పైగా ఆలయాలకు మహాకుంభాభిషేకాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ డిసెంబరులోపు మరో 300 ఆలయాలకుకుంభాభిషేకాలు నిర్వహించేందుకు జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. తమ పాలనలో 17 ఆలయాల్లో ఆస్పత్రులను కూడా ప్రారంభించినట్లు ఆయన వివరించారు.

కూర్చునే స్థలం కోసం.. కొట్టుకున్నారు



గాయపడిన హంపయ్య, గోవిందరాజు

తిరుమల సీఆర్వో వద్ద గదుల కోసం వేచివున్న భక్తులు కొట్టుకున్నారు. కూర్చునే స్థలం విషయంలో కర్నాటక, తమిళనాడుకు లకు చెందిన రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తమిళనాడులోని కోయంబత్తురుకు చెందిన కార్తీకేయ గాజు బాటిల్‌తో దాడి చేయడంతో కర్ణాటక లోని బళ్లారికి చెందిన గోవిందరాజు, హంపయ్య గాయపడ్డారు. వీరిని స్థానిక అశ్విని ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. ఆ తర్వాత ఆ రెండు కుటుంబాలు రాజీపడినట్టు తెలిసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో మనో



సినీగాయకుడు మనో గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'ఎన్నిసార్లు చూసిన స్వామివారి రూపాన్ని మర్చిపోతుంటాం. భక్తులను మళ్లీ మళ్లీ రప్పించుకునే గొప్ప క్షేత్రం తిరుమల' అని అన్నారు. త్వరలో ఉగాది రానుందంటూ, ఈ నూతన తెలుగు సంవత్సరాదిలో కళాకారులందరి కష్టాలు తొలగిపోయి అద్భుత విజయాలు సాధించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఏటీసీ దాకా క్యూలైన్




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.97 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,388

తలనీలాలు సమర్పించినవారు: 26,145

■ నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం





అరణ్య రోదన

- అంతరించిపోతున్న అడవులు
- పర్యావరణానికి పెను ప్రమాదం
- జనావాసంలోకి వన్యప్రాణులు

పర్యావరణ సమతుల్యానికి దోహదపడే అడవులు రాన్రానూ చిక్కిపోతున్నాయి. దురాక్రమణదారుల బారిన పడి తరిగిపోతున్నాయి. జీవవైవిధ్యానికి బాటలు వేసే వనాలు అంతరించిపోతున్నాయి. జనం చొచ్చుకు వస్తుంటే ఉండటానికి చోటు లేక జంతువులు జనారణ్యం బాటపడుతున్నాయి. కాలక్రమేణా అటవీ విస్తీర్ణం కుచించుకుపోవడంతో పర్యావరణానికి దుష్ఫలితాలు ఎదురవుతున్నాయి. ఇది భవిష్యత్‌లో మరింత ప్రాణ సంకటంగా మారుతుందని పర్యావరణ హితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి





అటవీ విస్తీర్ణం ఏటేటా తగ్గిపోతోంది. అటవీశాఖ తాజా విడుదల చేసిన నివేదిక ప్రకారం జిల్లాలో 8,692.82 చదరపు కిలోమీటర్ల అటవీప్రాంతం ఉంది. ఇందులో దట్టమైనది 6.38 చదరపు కిలోమీటర్లు మాత్రమే. మధ్యస్థ దట్టమైన అడవి 888.26 చదరపు కిలోమీటర్లు. బహిరంగ అడవి 1,209.39 చదరపు కిలోమీటర్లు ఉంది. మిగిలిన అటవీప్రాంతం వివిధ సార్థ ప్రయోజనాలతో తరిగిపోతోంది.

వన్యప్రాణులు జనావాసాల బాట

జిల్లా పరిధిలో శేషాచల కొండలు, వెలిగొండ అడవులు జీవవైవిద్యానికి నిలయాలు. ఈ అడవుల్లో చిరుతలు, ఏనుగులు, ఎలుగుబండ్లు, దుప్పులు, అడవి కుక్కలు, అడవి పందులు, జాకల్స్, హనీ బ్యాగ్గర్, చుక్కల దుప్పులు, జింకలు, అరుదైన బంగారుబల్లి, పునుగుపిల్లి, దేవాంగపల్లి వంటి వన్యప్రాణులు ఆవాసముంటున్నాయి. అరుదైన ఎర్రచందనం, పెర్రిత, సాంబ్రాణి వంటి చెట్లతో పాటు మోగి, కరక, నారేపి వృక్షాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. పక్షులు సీతాకోక చిలుకలు, పాములు, ఇతర కీటకాలు అడవినీడన నిశ్చింతగా బతుకుతున్నాయి. అడవులు కాస్తా క్రమేపి తరిగిపోవడంతో వన్యప్రాణులు గత్యంతరం లేక ఆహారం, నీటి కోసం జనావాసాల్లోకి రాకతప్పడంలేదు. .



ప్రకృతి సమతుల్యానికి భంగం

అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం పెనుప్రమాదంగా తయారవుతోంది. సమతుల్యత దెబ్బతిని పర్యావరణానికే ముప్పుగా పరిణమిస్తోంది. వృక్షాల సంఖ్య తగ్గి అడవి చిన్నబోతుండటంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే జనం అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారంటే అడవుల ప్రభావమే.ప్రకృతి సమతుల్యానికి విఘాతమేర్పడి వర్షాలూ తగ్గిపోతున్నాయని పర్యావరణ నిపుణులు ఆవేద న చెందుతున్నారు. అడవుల సంరక్షణ తక్షణ పరిష్కా రమని వీరంతా తలపోస్తున్నారు.

అభివృద్ధి పేరిట వేటు

తమ అవసరాల కోసం జనం అడవులను ఆక్రమించడం పరిపాటిగా మారింది. రోడ్లు, భవన నిర్మాణాలు, డ్యాములు, గనుల తవ్వకాల కోసమే కాదు అవసరమైన కలప కోసం అడవులపై గొడ్డలి వేటు పడుతోంది. ఈ పరిణామమే ఇపుడు మానవ మనుగడకు సవాలుగా మారింది. శేషాచల కొండల్లో శ్రీగంధం, ఎర్రచందనం వృక్షాలను అడ్డు ఆపులేకుండా నరికేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. తిరుమల కొండల్లోని శ్రీగంధం వృక్షాలు కనుమరుగయ్యాయి. ఆ జాబితాలోకి ఎర్రచందనంతో పాటు అరుదైన జంతువులు చేరిపోనున్నాయి. ఇప్పటికైనా అడవులు అంతరించి పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నడకదారిలో పాము





అలిపిరి కాలినడక మార్గంలో గురువారం ఎనిమిది అడుగుల జెర్రిపోతు పాము పట్టుబడింది. గాలిగోపురం వద్ద నున్న ఓ దుకాణంలోకి ప్రవేశించిన పామును భాస్కర్ నాయుడు బంధించి అడవిలో వదిలారు. అలాగే తిరుమలలోని మేదరమిట్ట ప్రాంతంలోని బరోడా బ్యాంక్‌పై భాగంలో ఉన్న హెల్త్ కార్యాలయంలో కూడా జెర్రిపోతును భాస్కర్‌నాయుడు పట్టుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

జెర్రిపోతులను పట్టుకున్న భాస్కర్‌నాయుడు

శునకాల మూతికి చిక్కం వేయాల్సిందే

- లేదంటే యజమానికి జరిమానా
- హెచ్చరించిన కార్పొరేషన్



. అడయార్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలో పెంపుడు శునకాలు మూతికి చిక్కం వేయాలని, లేనిపక్షంలో జరిమానా విధిస్తామని కార్పొరేషన్ హెచ్చరించింది. ఈ నిబంధన త్వరలోనే అమల్లోకి రానుంది. తద్వారా రోడ్లపై వెళ్ళే పాదచారులు, వాకింగ్ చేసే వారికి రక్షణగా ఉంటుందని భావిస్తున్నారు. నగరంలో రాత్రి వేళల్లో ఒంటరిగా, ద్విచక్ర వాహనాల్లో వెళ్ళేవారిని వీధి కుక్కలు వెంటపడి తరుముతున్న సంఘటనలు జరుగుతున్నాయి. వీటిలో పెంపుడు శునకాల కారణంగా జరిగే ప్రమాదాలను నివారించేలా కొన్ని నిబంధనలను అమలు చేయాలని నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పశుసంవర్ధక శాఖ అధికారులు భావిస్తున్నారు. పెంపుడు శునకాలను వీధుల్లోకి తీసుకొచ్చినపుడు వాటి మూతికి విధిగా కళ్ళాలు వేయడం, పెంపుడు శునకాలకు కార్పొరేషన్ నుంచి లైసెన్స్ పొందడం, పాదచారులు లేదా చిన్నారులు, మహిళలను పెంపుడు కుక్కలు కరిస్తే బాధితులకు వైద్య ఖర్చులన్నీ యజమాని భరించేలా, పెంపుడు శునకాలకు కుటుంబ నియంత్రణ టీకాలు, యాంటీ రాబిస్ వ్యాక్సిన్ విధిగా వేయాలన్న నిబంధనలు తీసుకుని రానున్నారు. కానీ నగరంలోని అనేకమంది పెంపుడు శునకాల యజమానులు మాత్రం ఈ నిబంధనలు పాటించడం లేదు. ఈ విషయంపై పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. పెంపుడు శునకాలకు మైక్రోచిప్ పొందుపరిచే విషయంపై విధివిధానాల రూపకల్పన జరుగుతోందన్నారు. ఇందులో గత యేడాది విడుదల చేసిన నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా శునకానికి లైసెన్స్ పొందడం, రాబిస్ టీకా వేయడం, ముఖానికి కళ్ళెం వేయడం వంటి నిబంధనలు అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయనున్నట్టు వెల్లడించారు.

కులాల వారీగా జనగణన చేపట్టాలి

- పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి డిమాండ్

ప్యారీస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులాల వారీగా జనగణన చేపట్టాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, కులగణన రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో ఒకటని, 2008వ సంవత్సరం గణాంకాల సేకరణ చట్టం ప్రకారం దేశంలో కులగణన నిర్వహించేందుకు ఆయా రాష్ట్రప్రభుత్వాలకు అధికారముందన్నారు. ఈ అధికారంతో తెలంగాణ, బీహార్, ఒడిశా, కర్ణాటక తదితర రాష్ట్రప్రభుత్వాలు అన్ని వర్గాలకు రిజర్వేషన్ పరంగా లబ్ధిచేకూర్చాలనే సంకల్పంతో కులగణన ప్రక్రియను పూర్తిచేశాయని తెలిపారు. అయితే తమిళనాడు ప్రభుత్వం మాత్రం కులగణనం నిర్వహించే అధికారం తమకు లేదనడం విడ్డూరంగా వుందన్నారు. ఈ వ్యవహారంలో ఏమైనా అడ్డంకులున్నట్లేతే కేంద్రప్రభుత్వాన్ని వివరణ అడగొచ్చని రాష్ట్రప్రభుత్వానికి సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై నిందమోపి, ప్రజలను పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్న డీఎంకే ప్రభుత్వ వైఖరి ఖండించదగ్గదని, ఈ 69శాతం రిజర్వేషన్ కాపాడుకునే అంశంలో పీఎంకే వెనకాడబోదని అన్బుమణి తేల్చిచెప్పారు.

సీమాన్ పార్టీలో వీరప్పన్ కుమార్తెకు కీలక పదవి



విద్యారాణి

ప్యారీస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దివంగత గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్యారాణి నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) రాష్ట్ర ఇళంజర్ పాసరై (యువజన విభాగం) ఆర్గనైజర్‌గా నియమితులయ్యారు. ఎన్‌కౌంటర్‌లో వీరప్పన్ మృతిచెందిన అనంతరం విద్యారాణి రాజకీయాలపై దృష్టిసారించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆమె ఎన్టీకేలో చేరారు. వెంటనే ఆమెకు పార్టీ అధిష్ఠానం కృష్ణగిరిలో పోటీచేసేందుకు టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో ఆమె ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో విద్యారాణికి పార్టీ యువజన విభాగం ఆర్గనైజర్‌గా కొత్త బాధ్యతలు అప్పగించినట్లు ఆ పార్టీ నేత సీమాన్ గురువారం ప్రకటించారు.

30 నుంచి మదురై-విజయవాడ మధ్య విమానాలు

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30వ తేది నుంచి మదురై-విజయవాడ మధ్య విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. మదురై విమానాశ్రయం నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై తదితర నగరాలకు విమాన సేవలు అందుబాటులో ఉండగా, విజయవాడకు వెళ్లాల్సిన ప్రయాణికులు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాలకు వచ్చి, అక్కడి నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో, మదురై-విజయవాడ మధ్య ఓ విమాన యాన సంస్థ ఈ నెల 30వ తేది నుంచి విమానాలు నడుపనుంది. ఆ ప్రకారం, మదురై నుంచి ఉదయం 8.15 గంటలకు బయల్దేరే విమానం 9.45 గంటలకు బెంగళూరు చేరుకొని, అరగంట తర్వాత 10.15 గంటలకు బయల్దేరి 11.55 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. మరుమార్గంలో విజయవాడ నుంచి సాయంత్రం 5.40 గంటలకు బయల్దేరి రాత్రి 7.25 గంటలకు బెంగళూరు చేరుకొని, అరగంట తర్వాత 7.55 గంటలకు బయల్దేరి 9.20 గంటలకు చెన్నై చేరుకుంటుందని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం ఆటో డ్రైవర్ వినూత్న యత్నం



ఆటోపై వేసిన మొక్కజొన్న ఆకులు

పెరంబూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడి నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగించే 76 ఏళ్ల ఆటో డ్రైవర్ తన ఆటోను వినూత్నంగా తీర్చిదిద్దాడు. రాష్ట్రంలో ఫిబ్రవరి మూడో వారం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. కార్లు, ఆటోలు, బస్సుల్లో వెళ్లే వారికి ఎండ వేడి తప్పడం లేదు. ఈ నేపథ్యంలో, సేలంకు చెందిన 76 ఏళ్ల ఆటో డ్రైవర్ సుబ్రమణి, తన ఆటోను వినూత్నంగా రూపొందించి ప్రయాణికులకు చల్లటి వాతావరణంలో తీసుకెళ్తున్నాడు. మొక్కజొన్న ఆకులను ట్రేలలో పేర్చి, వాటిని ఆటో పై భాగంలో ఉంచాడు. ట్రేకు ఇరువైపులా పైపులు ఏర్పాటు చేసి వాటిపై నీళ్లు పడేలా ఏర్పాటుచేయడంతో ఆటోలో ఏసీ ఉన్నట్టు చల్లగా ఉంటోంది. అలాగే, ఆటోలో 10 లీటర్ల క్యాన్ ఏర్పాటుచేసి ప్రయాణికులు, ఇతరులకు కూడా ఉచితంగా నీరు అందిస్తున్నారు. దీంతో, సుబ్రమణ్యం ఆటో కోసం పలువురు ఎదురు చూస్తుండడం కొసమెరుపు.

ప్రాచీన విజ్ఞాన సంపదను కాపాడుకోవాలి

- జాతీయ సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవంలో గోపాలస్వామి




నెల్లూరుకు చెందిన ప్రత్యేక ప్రతిభావంతుడు హరిబాబుకు పీహెచ్‌డీ పట్టా అందిస్తున్న గోపాలస్వామి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు గల మన ప్రాచీన భారతీయ విజ్ఞాన సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని భారత మాజీ ఎన్నికల ప్రధానాధికారి, నీలామంగళం గోపాలస్వామి పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ 4వ స్నాతకోత్సవంలో ఆయన ఛాన్సలర్ హోదాలో పాల్గొని ప్రసంగించారు. ప్రతిభ మనిషికి వ్యక్తిగతంగానే కాకుండా, దేశానికి కూడా మంచి పేరు తెస్తుందన్నారు. గత అభివృద్ధిని సమీక్షించుకొని, భవిష్యత్ అభివృద్ధికి మార్గం చూపేలా స్నాతకోత్సవం ఉండాలని కోరారు. ఇందుకోసం రూపొందించుకున్న ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. సంస్కృత వర్సిటీకి చెందిన పంచముఖి, మాడగుల నాగఫణిశర్మకు ఈ ఏడాది పద్మశ్రీ అవార్డులు రావడం గర్వకారణమన్నారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథి వర్సిటీ మాజీ ఛాన్సలర్ డాక్టర్ వీఆర్ పంచముఖి వర్చువల్‌గా మాట్లాడుతూ.. సంస్కృత భాష పరిరక్షణకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం మూల కేంద్రంగా నిలుస్తోందన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. 42 మందికి బంగారు పతకాలు, 564 మందికి డిగ్రీలను ప్రదానం చేశారు.

వైదిక శాస్త్రంలో ప్రావీణ్యం సాధించిన తాజుద్దీన్

కేరళలోని త్రివేండ్రంకు చెందిన షాజీన్ మహమ్మద్ తాజుద్దీన్ డాక్టరేట్ స్వీకరించారు. ముస్లిం కుటుంబంలో జన్మించిన ఈయన.. వైదిక శాస్త్ర విద్యలో ప్రావీణ్యాన్ని సాధించడం విశేషం. తల్లిదండ్రులతో పాటు స్నాతకోత్సవానికి హాజరై, పట్టా అందుకున్నారు. న్యాయ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ రామ్‌లాల్ శర్మ పర్యవేక్షణలో షాజీన్ మహమ్మద్ తాజుద్దీన్ పీహెచ్‌డీ పూర్తి చేశారు. రామశాస్త్రి కృత శతకోటి అనుసరేణ గదాధర సత్ప్రతిపక్ష బాజక రక్షణస్య - విశిష్ట అధ్యయనం అంశంపై ఆయన సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సౌజన్యంతో నిర్వహిస్తున్న ఓ రీసెర్చ్ ప్రాజెక్టులో తాజుద్దీన్ ప్రాజెక్టు అసిస్టెంట్‌గా వ్యవహరిస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్ - కిలాంబాక్కం మధ్య రూ.9,335 కోట్లతో కొత్త మెట్రోరైలు మార్గం



టి.నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం బస్ టెర్మినల్ వరకు రూ.9335 కోట్లతో మెట్రోరైలు మార్గం నిర్మించనున్నారు. ఈ మేరకు మెట్రోరైలు సంస్థ రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. మెట్రోరైలు ప్రాజెక్టు-1 విస్తరణలో భాగంగా ఈ రెండు ప్రాంతాల మధ్య మెట్రోరైలు మార్గాన్ని నిర్మించనున్నారు. ఈ రైలు మార్గం ప్రణాళికను మెట్రోరైలు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధిక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రయత్నాల శాఖ కార్యదర్శి కె.గోపాల్‌కు సమర్పించారు. మొదటి దశ మెట్రోరైలు ప్రాజెక్టు ప్రకారం చెన్నై సెంట్రల్ నుండి పరంగిమలై దాకా, విమ్కోనగర్ నుంచి విమానాశ్రయం వరకు నిర్మించిన మార్గాల్లో మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో మొదటి దశ మెట్రోరైలు ప్రాజెక్టును విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం బస్ టెర్మినల్ వరకు విస్తరింపజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు ప్రాంతాల నడుమ 15.46 కి.మీ.ల దూరం వరకు మెట్రోరైలు మార్గాన్ని నిర్మించనున్నామని పేర్కొన్నారు.

13 రైల్వేస్టేషన్లు...

ఈ మార్గంలో విమానాశ్రయం వద్ద కొత్తగా మరొక మెట్రో రైల్వేస్టేషన్ నిర్మిస్తారు. అక్కడి నుంచి కిలాంబాక్కం వరకు మార్గమధ్యంలో పల్లావరం, కోదండం నగర్, క్రోంపేట, మహాలక్ష్మి కాలనీ, తిరువికనగర్, తాంబరం, ఇరుంబులియూరు, పీర్‌కాక్కరణై, పెరుంగళత్తూరు, వండలూరు, అరింజర్ అన్నా జంతు ప్రదర్శన శాల, కిలాంబాక్కం తదితర మొత్తం 13 రైల్వేస్టేషన్లు నిర్మించనున్నారు.